గడ్డి విత్తనాలు కరువు

- విత్తనాల సరఫరాలో జాప్యం
- పశుగ్రాసానికి తప్పని తిప్పలు
- జొన్న, మొక్కజొన్న సాగుపై దృష్టి


గోయగాం సమీపంలో గడ్డి మేస్తున్న పశువులు


కెరమెరిలో జొన్న పంట సాగు చేస్తున్న రైతు

కెరమెరి: ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు పశుపోషణ భారంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏటా పంపిణీ చేసే గడ్డి విత్తనాల సరఫరాలో ఈ ఏడాది జాప్యం జరుగుతోంది. దీంతో పశుగ్రాసం లభించక మూగజీవాలు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. కెరమెరి మండలం వ్యవసాధారిత మండలం కావడంతో పశువుల సంఖ్య ఎక్కువగానే ఉంది. కానీ ఈసారి గడ్డి విత్తనాలు సరిపోక రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

75శాతం రాయితీ..

మండలంలో 31 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వాటిలో పశువులు 18507, గేదెలు 673, మేకలు 33, 254, గొర్రెలు 644 ఉన్నాయి. ఏటా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 75 శాతం రాయితీపై ఏటా గడ్డి విత్తనాలు సరఫరా చేసేవారు. ఇందుకోసం బడ్జెట్ కేటాయించి కొనుగోలు చేసి రైతులకు అందించేవారు. ఈ విత్తనాలు ఏటా డిసెంబర్, జనవరి నెలల్లో పశువైద్య శాలలకు చేర్చి అక్కడ నుంచి రైతులకు రాయితీపై అందజేసేవారు. యాసంగి ఆరంభంలో పంపిణీ చేసే గడ్డి విత్తనాలను రైతులు వేసవిని దృష్టిలో పెట్టుకొని సాగు చేసేవారు. తద్వారా గ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకునేవారు. కానీ ఈసారి ఇప్పటి వరకు కూడా గడ్డి విత్తనాలు పశువైద్య శాలలకు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది మిగిలిన కొన్ని విత్తనాలు పంపిణీ చేయగా, అవి ఎటూ సరిపోక ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రత్యామ్నాయ చర్యలు..

గడ్డి విత్తనాలు ఇప్పటి వరకు అందకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నారు. జొన్న, మొక్కజొన్న పంటల సాగువైపు దృష్టి సారించారు. తమ పొలంలో బోర్లు వేసి బిందు సేద్యం ద్వారా జొన్న, మొక్కజొన్న పండిస్తున్నారు. మండలంలో మొత్తం 6436 మంది రైతులు ఉండగా, 29వేల ఎకరాల్లో పంటలను పండిస్తున్నారు. అందులో 700 ఎకరాల్లో జొన్న, 500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. బోర్లు ఉన్న వారు ఎలాగైన తమ పశువులను కాపాడుకునేందుకు పంటలు సాగు చేస్తుండగా, వర్షాధారిత పంటల రైతులు మాత్రం గడ్డిని బయటి నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి గడ్డి విత్తనాలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



ప్రతీ సంవత్సరం గడ్డి విత్తనాలు రాయితీపై ఇచ్చేవారు. కానీ ఈసారి ఇప్పటి వరకు మండలానికి విత్తనాలు చేరుకోకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్న కొన్నింటిని రైతులకు పంపిణీ చేసినా ఇంకా విత్తనాలు అవసరమున్నాయి. అధికారులు స్పందించి విత్తనాలు సరఫరా చేయాలి.

– పెందోర్ మోతీరాం, మాజీ ఎంపీపీ

ప్రతిపాదనలు పంపించాం..



గతేడాది ఉన్న 400 కిలోల గడ్డి విత్తనాలను పంపిణీ చేశాం. ఈ సంవత్సరం రావాల్సినవి ఇంకా మంజూరు కాలేదు. పశువులు ఎన్ని ఉన్నాయి.. ఎన్ని విత్తనాలు అవసరమున్నాయి.. అనే విషయాలను అధికారులకు నివేదించాం. విత్తనాలు రాగానే అవసరమైన వారికి పంపిణీ చేస్తాం.

– కే.సురేశ్, పశువైద్యాధికారి, కెరమెరి

క్లుప్తంగా

రేపు క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

దహెగాం: మండలంలోని గెర్రె గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు దందెర మల్లేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులు తమ జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మొదటి బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు ఉంటుందన్నారు. క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉత్సాహంగా ఫ్రెండ్లీ క్రికెట్ పోటీ


ఇరు జట్లతో సీఐ బుద్దె స్వామి

రెబ్బెన: పోలీసులు, జర్నలిస్టుల మధ్య ఆదివారం గోలేటి భీమన్న స్టేడియంలో నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ పోటీ రసవత్తరంగా సాగింది. రెబ్బెన సీఐ బుద్దె స్వామి పోటీని ప్రారంభించారు. విజేతగా నిలిచిన పోలీసు జట్టుతో పాటు ప్రెస్‌క్లబ్ జట్టుకు సీఐ ట్రోఫీలు అందజేశారు. ఎస్సై చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది, ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

'యూనివర్సిటీ పేరు మార్పు సరికాదు'


పుల్లూరి సతీశ్ కుమార్

బెజ్జూర్: పొట్టి శ్రీరాములు పేరున్న యూనివర్సిటీని సూరవరం ప్రతాపరెడ్డిగా పేరు మారుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం సరికాదని ఆర్యవైశ్య జిల్లా యూత్ అధ్యక్షుడు పుల్లూరి సతీశ్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు గొప్ప మహనీయుడని ఆయన పేరు తీసివేయడం సమంజసం కాదన్నారు. ప్రతాపరెడ్డి పేరును వేరే యూనివర్సిటీకి పెట్టాలన్నారు. నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఆర్యవైశ్య సంఘం తరపున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

చేతిపంపునకు మరమ్మతులు


చేతిపంపునకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

కౌటాల: కౌటాల మండలం వీరవెల్లి గ్రామం ఎస్సీకాలనీలోని చేతిపంపు నిరుపయోగంగా ఉండడంతో స్థానికులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన 'చేతిపంపు మరమ్మతు చేయరూ..!' కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఆదివారం పంచాయతీ సిబ్బంది చేతిపంపునకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. దీంతో కాలనీవాసులు సాక్షి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి


జయంతిలో పాల్గొన్న వాసవి క్లబ్ ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం జిల్లా కేంద్రంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు దీక్ష తత్పరుడని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర సాధనలో అనుకున్న లక్ష్యాన్ని సాధించే వరకు వెనక్కి తగ్గకుండా పోరాటం చేసిన మహనీయుడన్నారు. వాసవిక్లబ్ ప్రతినిధులు చిలువేరు వెంకన్న, రావుల శంకర్, గంధం శ్రీనివాస్, గుండా ప్రమోద్, కాచం మధుకర్, అముల్, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి జాతర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వినోద్, తిరుపతిగౌడ్

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఏప్రిల్ 12, 13వ తేదీల్లో నిర్వహించనున్న జాతర మహోత్సవ వాల్ పోస్టర్‌ను ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు దేవార వినోద్, ఆలయ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్‌లు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మాదిరిగానే చైత్ర పౌర్ణమి పురస్కరించుకుని ఆలయంలో మహంకాళి జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 12న శివపార్వతుల కల్యాణం, 13న మహంకాళి అమ్మవారి పుట్టిన రోజున జాతర, అమ్మవారికి బోనాల సమర్పణ, రథోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతరకు జిల్లాలోని భక్తులతో పాటు చుట్టు పక్కల జిల్లాల నుంచి భారీగా తరలివచ్చే భక్తుల కోసం ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై జాతర మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు దుర్గం తిరుపతి, భక్తులు మల్లేశ్, రమేశ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నెలాఖరున చోర్‌పల్లికి మీనాక్షినటరాజన్


గ్రామస్తులతో మాట్లాడుతున్న సుగుణ

లింగాపూర్: ఇందిరా ఫెలోషిప్ కార్యక్రమంలో భాగంగా ఈనెల చివరి వారంలో మండలంలోని చోర్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ రెండు రోజుల పాటు పర్యటిస్తారని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్ తెలిపారు. ఈమేరకు ఆదివారం గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. సోయం ముకుంద్, మర్సుకోల మనోహర్, సునీల్, ధర్మారావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై ప్రవీణ్ కుమార్

బెజ్జూర్: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. మొగవెల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల మారుమూల అటవీ ప్రాంతమైన బందెలగూడెం గ్రామ యువకులకు ఆదివారం వాలీబాల్ కిట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, శరీర దారుఢ్యం పెంపొందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన సాంకేతికతతో సేవలు

ఆసిఫాబాద్‌అర్బన్: అత్యుత్తమ సాంకేతికతతో వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించనున్నట్లు ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాథోడ్ శేషారావ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్‌లో భాగంగా 33కేవీ, 11కేవీ స్తంభాలకు యూనిక్ పోల్ నంబర్ పెయింటింగ్ ప్రక్రియ చేపట్టామన్నారు. ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే ఆ పోల్ నంబర్ ద్వారా అక్కడి లొకేషన్ మ్యాపింగ్‌తో వెంటనే వెళ్లి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. విద్యుత్ అంతరాయాలను తగ్గించడంలో నంబరింగ్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

బీఆర్ఎస్ నేతల దిష్టిబొమ్మలు దహనం


వాంకిడి: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

లింగాపూర్: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో ఆదివారం ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, కేటీఆర్, హరీశ్‌రావుల దిష్టిబొమ్మలు దహనం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఆత్రం అనిల్‌కుమార్, చవాన్ సునీల్, బలిరాం, రమేశ్, సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.

దళిత నాయకునిపై అనుచిత వ్యాఖ్యలు సరికావు

వాంకిడి: దళిత నాయకులపై బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి కించపరిచేలా మాట్లాడారని, దళితులు, కాంగ్రెస్ నాయకులపై ఇష్టరీతిన మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. పార్టీ యూత్ మండల అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, అనిల్, జీవన్, గణేశ్, దీపక్ ముండె, మహిళ నాయకులు ఉష తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆత్రం కుసుంబ్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఎదుట కార్యకర్తలతో నిరసన చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్ పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు లింబారావు, నగేశ్, గుత్‌బోద్దిన్, తిరుపతి, ముకుంద్‌రావు, రాజు, లింబారావు, హన్మంతు, విశ్వనాథ్, సిరాజ్, రవి నాయక్, సోమా తదితరులు ఉన్నారు.


లింగాపూర్‌లో..


కెరమెరి: నిరసన తెలుపుతున్న నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి




మహబూబ్‌ఖాన్ మృతదేహం

ఘటన స్థలంలో తీవ్రంగా గాయపడ్డ యువకులు

- నలుగురికి తీవ్రగాయాలు

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని కోసిని గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు బోలోరో వాహనాలు కాగజ్‌నగర్‌వైపు వస్తున్నాయి. కోసిని రైస్‌మిల్లు సమీపంలో ఒకదానిని మరొకటి ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఒక తోపుడు బండిని, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాయి. ఈ ఘటనలో తోపుడు బండిపై గాజుల వ్యాపారం చేసే డాడానగర్‌కు చెందిన షేక్ మహబూబ్ ఖాన్(55) అక్కడికక్కడే మృతి చెందాడు. వేంపల్లి గ్రామానికి చెందిన నలుగురు యువకులు నందిపేట తరుణ్, బూరం కార్తీక్, దుర్గం చరణ్, ఈశ్వర్‌కు తీవ్రగాయాలయ్యాయి. నలుగురు యువకులు ఒకే ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా ఈ ఘటన జరిగింది. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో నందిపేట తరుణ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సందీప్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించి కేసు విచారణ జరుపుతున్నారు.

ఇతరుల పేరిట.. ఇనాం భూమి

- రైతుకు తెలియకుండానే మార్పిడి చేసిన అధికారులు
- న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధిత రైతు


రెవెన్యూ రికార్డులు చూపుతున్న రైతు నారాయణ


రైతుకు గతంలో ఇచ్చిన పట్టా పాసుపుస్తకం

బెజ్జూర్: భూమి లేని నిరుపేదలు సాగు చేసుకునేందుకు వీలుగా గతంలో ప్రభుత్వం పంపిణీ చేసిన ఇనాం భూమిని రైతుకు కూడా తెలియకుండా ఇతరుల పేరిట మార్పిడి చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. భూమి లేని నిరుపేదలకు 1975–80లలో ఇనామ్ భూములు పంపిణీ చేసి సీలింగ్ పట్టాలు సైతం అందించారు. ప్రభుత్వ సర్వే నంబర్ ఏర్పాటు చేసి పాసు పుస్తకాలు కూడా జారీ చేశారు. దీంతో పేద ప్రజలు ఆ భూములను సాగు చేసుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. రెవెన్యూ రికార్డుల్లో భూముల యజమానులుగా వారి పేర్లే ఉన్నాయి. కానీ ఏదైన అవసరం వస్తే వాటిని విక్రయించడానికి వీలుండదు. అక్కడ ఏవైనా నిర్మాణాలు చేపట్టడం కూడా కుదరదు. వారసత్వంగా వచ్చిన వాటిని అమ్ముకోవడానికి వీలుండదు. కానీ బెజ్జూర్ మండలంలో ఇనామ్ భూమిని రైతుకు తెలియకుండానే రెవెన్యూ అధికారులు ఇతరుల పేరిట మార్పిడి చేశారు.

సీలింగ్ పట్టా మార్పిడి..

ఇనాం కింద ఇచ్చిన భూములు ఎవరూ అమ్మడం కానీ కొనుగోలు చేయడం కాని కుదరదు. ప్రభుత్వం ఎవరికి ఇనాం ఇచ్చిందో ఆ కుటుంబ సభ్యులు దానిపై ఆధారపడి జీవించాల్సి ఉంటుంది. కానీ అప్పటి అధికారులు రెవెన్యూ చట్టాలను తుంగలో తొక్కి చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించారు. రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తిపడి ఇనాం భూమిని ఇతరుల పేరిట మార్పిడి చేసి తనకు అన్యాయం చేశారని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. బెజ్జూర్ మండలంలోని ముంజంపల్లి శివారులో సర్వే నంబర్ 138/14ఏలో 3 ఎకరాల భూమిని అప్పటి అధికారులు అదే గ్రామానికి చెందిన కొట్రంగి నారాయణ తండ్రి భిక్కు అనే రైతుకు గతంలో సీలింగ్ పట్టా ఇచ్చారు. ఇప్పుడు రైతుకు తెలియకుండానే అదే గ్రామానికి చెందిన దేవాజీ అనే వ్యక్తి పేరుపై పట్టా మార్పిడి అయినట్లు ధరణి వెబ్‌సైట్‌లో కనిపిస్తుందని బాధిత రైతు నారాయణ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. సమస్య పరిష్కరించి తన భూమిని తనకు అప్పగించాలని రెవెన్యూ అధికారుల చుట్టూ గత నాలుగేళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నాడు.

రెవెన్యూ రికార్డుల్లో రైతు పేరే..

రెవెన్యూ మ్యానువల్ రికార్డులో నారాయణ రైతు పేరిటే ఇనాం భూమి ఉంది. గత 15 నుంచి 20 సంవత్సరాల మ్యానువల్ రికార్డులో 138/14ఏ కొట్రంగి నారాయణ పేరు రికార్డులో ఉంది. కానీ కొత్తగా ధరణిలో మాత్రం వేరే రైతు పేరు కనిపించడం ఏంటని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అధికారులు 'మామూలు'గా తీసుకుని తనకు తెలియకుండా భూమిని ఇతరుల పేరిట మార్పిడి చేశారని ఆరోపిస్తున్నాడు. కాగా తహసీల్దార్ భూమేశ్వర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

దుప్పిని హతమార్చిన ముగ్గురిపై కేసు

పెంచికల్‌పేట్: మండలంలోని లోడుపల్లి కొత్తవాడ వద్ద చుక్కల దుప్పిని హతమార్చిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఎస్‌వో వేణుగోపాల్ ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా లోడుపల్లి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న వారిని ఆపడంతో చేతుల్లో ఉన్న మాంసపు సంచులను అక్కడే వదిలేసి పారిపోయారు. వారిని వెంబడించి పట్టుకుని విచారించగా చుక్కల దుప్పిని హతమార్చినట్లు అంగీకరించారు. దుప్పిని హతమార్చిన గ్రామానికి చెందిన గొర్లపల్లి శేఖర్, బొల్లబోయిన గంగయ్య, ఆత్రం శంకర్‌పై వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఎఫ్‌బీవోలు లచ్చన్న, సతీశ్, మహేష్, సిబ్బంది ఉన్నారు.

అదుపుతప్పి బొగ్గు టిప్పర్ బోల్తా


టిప్పర్‌ను పరిశీలిస్తున్న బోగె ఉపేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ నుంచి బొగ్గు లోడుతో గోలేటి సీహెచ్‌పీకి వస్తున్న టిప్పర్ శనివారం రాత్రి సోనాపూర్ బ్రిడ్జి వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో లారీ డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. సింగరేణి అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యంతోనే...

సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే బొగ్గు ట్రాన్స్‌పోర్టు సంస్థ నిబంధనలు పాటించడం లేదని, తద్వారా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగె ఉపేందర్ అన్నారు. ఆదివారం బోల్తా పడిన టిప్పర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా టిప్పర్లు అధిక లోడుతో వెళ్తుండడంతో అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రోజుకు 12 నుంచి 15 ట్రిప్పులు కొట్టాలంటూ డ్రైవర్లపై ఒత్తిడి తేవడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా బొగ్గును ట్రాన్స్‌పోర్ట్ చేస్తున్న సంస్థపై, అందుకు సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు మృతి

సిర్పూర్(టి): ఈనెల 12న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని పాతట్లగూడ కాలనీకి చెందిన మహ్మద్ ఉల్లాఖాన్ (10) ఈనెల 12న పాఠశాల నుండి ఆటోలో ఇంటికి వెళ్తుండగా బైక్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించి చికిత్స అందించారు. వైద్యుల సూచన మేరకు మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు.